క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ హుండీ ఆదాయం ఆదివారం లెక్కించారు. శనివారం సాయి బాబా జాతరను పురస్కరించుకుని ఆలయానికి రూ.3లక్షల 60వేల550 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్ తెలిపారు. హుండీ ద్వారా రూ.లక్షా76వేల950, సాయిబాబా మెడల హారం ద్వారా రూ.24,960, శివపార్వతుల కల్యాణం ద్వారా రూ.22,700, తైబజార్ ద్వారా రూ.37,440, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.37,500, కొబ్బరికాయల ద్వారా రూ.55,000, కుంకుమార్చన ద్వారా రూ.6వేల ఆదాయం వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

లక్ష్మణచాంద: మండలంలోని చాంతల్‌చాంద గ్రామంలో వరసిద్ధి వినాయకుడి కల్యాణం ఆదివారం ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని వీడీసీ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించగా మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం చేశారు. సాయంత్రం గ్రామంలో పల్లకిసేవను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన జాతరకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో పూర్వవిద్యార్థులు, టీచర్లు

కుంటాల: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.లక్ష జమ చేసి పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఆదివారం సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆవిష్కరించారు. అర్చకులు వినయ్ పాండే ఆధ్వర్యంలో గణపతి, గౌరీ, హోమం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విగ్రహం ఏర్పాటుకు ముందుకొచ్చిన పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండ



సాయం అందిస్తున్న గంగాధర్

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో అనాథలుగా మారిన గంగాధర్, పుష్ప అనే ఇద్దరు చిన్నారులకు నిర్మల్ అటవీశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసే గైక్వాడ్ గంగాధర్ రూ.6వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి చిన్నారులను పరామర్శించారు. నూతన దుస్తులు అందించి వారితో భోజనం చేశారు. పిల్లల ఖర్చుల నిమిత్తం ప్రతినెలా రూ. 2వేలు ఇస్తానని గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నడింపల్లెలో పరామర్శిస్తున్న జాన్సన్

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను ఆదివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోనగిరి సునీత, కతులాపూర్‌లో సాయిచంద్, గోసంపల్లెలో గుమ్ముల చిన్నలింగయ్య, నడింపల్లె గ్రామంలో భూమన్న మృతి చెందగా బాధిత కుటుంబాలను వేర్వేరుగా పరామర్శించారు.

పోచమ్మా.. చల్లంగ చూడమ్మా

జిల్లాలో ప్రతి ఏటా దేవలదండు (పుష్య) అమావాస్య నుంచి గ్రామదేవతలకు చలిబోనాలు సమర్పించే వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి బోనం వండి.. ఆదివారం ఉదయం ఆ చలి బోనాన్ని గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. దేవతలంతా దండుగా వచ్చి నైవేద్యాన్ని స్వీకరిస్తారని పలువురి భక్తుల నమ్మకం. శివరాత్రి పర్వదినానికి ముందు అమావాస్య తర్వాత వచ్చే మొదటి ఆదివారం చలిబోనాలను గ్రామదేవతలకు సమర్పించడం ఆనవాయితీ అని మరికొందరు పేర్కొంటున్నారు.



బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



ఖానాపూర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద..



లోకేశ్వరంలో..



కుంటాలలో నెత్తిన బోనాలతో మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లోనూ గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కుంటాల: కుంటాల గజ్జలమ్మ, ముత్యాలమ్మ,మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో చలిబోనాల సందడి కనిపించింది. శనివారం రాత్రి పెరుగు, అన్నంతో వండిన నైవేద్యాన్ని ఆదివారం గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ఆవు పేడ, పిడకలు అమ్మవారి వద్ద ఉంచి శుభం కలగాలని పూజలు చేశారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారు, శాంతినగర్ పోచమ్మ ఆలయం, ఇంద్రనగర్ పోచమ్మ ఆలయం, శాస్త్రినగర్ మారెమ్మ ఆలయం, ప్రియదర్శినగర్ పోచమ్మ ఆలయం, ద్యాగవాడ సారలమ్మ, బుధవార్‌పేట్ పోచమ్మ ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, రాజూర వట్టోలి, మొహళ తదితర గ్రామాల్లో ముత్యాలమ్మ, మహాలక్ష్మి గ్రామదేవతలకు చలిబోనాలను నైవేద్యంగా సమర్పించారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో పోచమ్మ, మహాలక్ష్మి, కట్ట పోచమ్మ, బద్ది పోచమ్మ, జువ్వలవ్వ, గజ్జెలమ్మ తదితర గ్రామదేవతలకు చలిబోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో ఆదివారం పోచమ్మకు చలిబోనాలు సమర్పించారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో రాత్రి మట్టి కుండలో నైవేద్యం వండి ఉదయం గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించారు.



లక్ష్మణచాంద: మునిపెల్లిలో..



సోన్ : న్యూవెల్మల్‌లో బోనమెత్తిన మహిళలు



కడెం : మాసాయిపేట్‌లో..



నిర్మల్‌లోని ఇంద్రనగర్‌లో..

'తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి'



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నేతలు

సారంగాపూర్: ఎమ్మెల్సీ, తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘం నాయకులు ఆదివారం స్థానిక ఎస్సై సాయికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో రెడ్డి కులస్తుల మనోభావాలు దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. వంగ భూమారెడ్డి, చిన్నోల్ల రాజారెడ్డి, పటేల్ ప్రకాష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శాంతన్‌రెడ్డి, అఖిలేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు' జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 7న నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీ కృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లోని విగ్రహం ఎదుట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను వివరించే క్రమంలో నిర్వహించే హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. శంకర్, హరీశ్, ప్రవీణ్, రాకేశ్, నూతన్, వికాస్, వెంకటేశ్, రాజేశ్వర్, సాయి, తేజ, గౌతం తదితరులు ఉన్నారు.

ఇసుక తోడేస్తున్నారు..

- భైంసా మండలంలోని వాగుల నుంచి యథేచ్ఛగా తరలింపు
- అక్రమార్కులను పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న కూలీలు



పేండ్‌పల్లి వాగు వద్ద ఇసుక ట్రాక్టర్లు

భైంసారూరల్: మండలవ్యాప్తంగా అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామాల్లోని వాగుల నుంచి ఇసుకను అనుమతి లేకుండా తోడేస్తున్నా.. పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. దీనిని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటూ లాభాలు గడిస్తున్నారు. మరోవైపు ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు జరిపితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రధాన వాగుల్లో...

భైంసా మండలంలోని సుద్దవాగు నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతుంది. ఖథ్‌గాం, హజ్గుల్, కామోల్, పేండ్‌పెల్లి, బోరిగాం గ్రామాల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇక చింతల్‌బోరి నుంచి వచ్చే వాగులో గుండేగాం, బిజ్జూర్, మాటేగాం గ్రామాల వద్ద, మరోవైపు సిరాల, ఇలేగాం, దేగాం, వాలేగాం గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తానూరుకు తీసుకెళ్తున్నారు.

డంప్ చేసి..

ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులకు పని సులువు అవుతోంది. వాగుల్లో నుంచి ట్రాక్టర్ల ద్వారా తీసుకొస్తున్న ఇసుకను భైంసా పట్టణ సమీపంలో డంప్ చేస్తున్నారు. ఇక్కడ ఎటువైపు చూసినా ఇసుక కుప్పలే దర్శనమిస్తున్నాయి.

అధికారులకు తెలిసే దందా..

కొందరు అక్రమార్కులైతే అధికారులకు బహిరంగంగానే కొంత ముట్టజెప్పి తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. పోలీస్‌శాఖ అధికారులు అప్పుడప్పుడు ఇసుక తరలిస్తున్న వాహనాలను స్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. అయినప్పటికీ ఈ అక్రమ రవాణా ఆగడం లేదు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయిస్తున్నాం. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రధాన వాగుల వద్ద నిఘా పెంచి అక్రమంగా ఇసుక తరలకుండా చూస్తాం. – ప్రవీణ్‌కుమార్, భైంసా తహసీల్దార్

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పెంబి: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని పస్పుల, హరిచంద్‌తండా, కొలాంగూడ, గుమ్మెన ఎంగ్లాపూర్, వస్పల్లి, చాకిరేవు తదితర ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా సమస్యలు తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా.? అనే దానిపై వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చింతల్‌పేట్‌ను పంచాయతీగా మార్చాలని వినతి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇట్ల పోతే ప్రమాదాలే..



జిల్లాకేంద్రంలో రద్దీగా ఉండే శివాజీచౌక్, బస్టాండ్ ఏరియా, ఈద్గాం చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొందరు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రయ్‌మంటూ రోడ్లపైకి దూసుకొస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిర్లక్ష్యంగా ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ ద్విచక్రవాహనదారులు కింద పడుతున్నారు. కొందరు వాహనదారులు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలివీ. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఈద్గాం చౌరస్తా వద్ద ట్రాక్టర్ నడుపుతున్న మైనర్



శివాజీచౌక్‌లో ఒకే వాహనంపై వెళ్తున్న ముగ్గురు

నూతన ఉద్యోగులకు సన్మానం

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఉపాధ్యాయుడిగా, సృజన్ పంచాయతీరాజ్ శాఖలో జేఈవోగా ఇటీవల ఉద్యోగాలు సాధించారు. ఆదివారం వీరిని గ్రామస్తులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మాజీ చైర్మన్‌కు సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం కాలనీ యువకులు మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ చిన్నం సత్యంను ఘనంగా సన్మానించారు. ఇటీవల చైర్మన్ పదవికాలం ముగియగా.. ఆయన చైర్మన్‌గా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

టేకు చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

తానూరు: మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన పాంచాల్ వెంకటేశ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా టేకు చెట్లు నరికినందుకు రూ.5 వేల జరిమానా విధించినట్లు బాసర ఎఫ్‌ఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని హిప్నెల్లితండా గ్రామానికి చెందిన విఠల్ పొలంలో ఉన్న టేకు చెట్లను కోలూరు గ్రామానికి చెందిన పాంచాల్ వెంకటేశ్‌కు విక్రయించాడు. శనివారం వెంకటేశ్ అధికారుల అనుమతి లేకుండా చెట్లను నరికి తీసుకెళ్తుండగా అటవీశాఖ అధికారులు, పోలీసులు వచ్చి పరిశీలించారు. వివరాలు తెలుసుకొని అనుమతుల్లేకుండా చెట్లను నరికినందుకు ఆదివారం వెంకటేశ్‌కు రూ.ఐదు వేల జరిమానా విధించినట్లు ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా చెట్లను నరికివేయొద్దని ఎఫ్‌ఆర్‌వో సూచించారు.

అటెన్షన్ ప్లీజ్.. ఒంటికి, రెంటికి వెళ్లేదెలా?



తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ 100 మందికి పైగా విద్యార్థులు, 10 మందికిపైగా సిబ్బంది ఉన్నారు. ఒంటికి, రెంటికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని.. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: పరశురాం, డీఐఈవో, ఫోన్ : 80746 92409

బాధిత కుటుంబానికి పరామర్శ

కడెం: మండల కేంద్రానికి చెందిన మైస గణేశ్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆదివారం బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్ రాథోడ్ పరామర్శించారు. మృతికి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, కిష్టయ్య, ధీరజ్, శ్రీరాం, రంజిత్, శ్రావణ్, తదితరులున్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

నిర్మల్‌ఖిల్లాగేట్: వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం శ్రీ సరస్వతీ శిశుమందిర్ బుధవార్‌పేట్, బాగులవాడ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు కొండూరు నరేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పురోహితులు శ్రీకాంతాచారి ఆధ్వర్యంలో యజ్ఞం, అక్షరాభ్యాసం ఉంటుందని పేర్కొన్నారు.